విశ్వా జాడలేదు. . .

ఏమైంది. . .

కృషి యిక్కడ నిలబడి విశ్వ గురించి ఆలోచిస్తున్న సమయానికి ఆటోలో వస్తున్నాడు విశ్వ.

ఆటో బర్కత్‌పురా చౌరస్తా దాటుతూంది.

యూనివర్శిటీ చేరుకోటానికి ఇంకా పది నిముషాలు కావాలి.

అసలు ముందే వచ్చేవాడు కాని సెంట్రల్ లైబ్రరీలో ఆలస్యమైంది. ఎన్‌సైక్లోపిడియాలతో నాలుగు రోజులుగా సాగిస్తున్న కుస్తీ ఓ అరగంట క్రితంగాని పూర్తి కాలేదు.

ఫీవర్ హాస్పిటల్ దాటుతుండగా హఠాత్తుగా ఆగిపోయింది ఆటో.

ఏం జరిగిందీ విశ్వ ఆలోచించే లోగానే ఆటోకి అడ్డంగా వున్న టాక్సీలో నుంచి నలుగురు దృఢకాయులు దిగారు.

మనసేదో కీడు శంకించిన విశ్వాకి తనను తాను రక్షించుకునే అవకాశం సైతం లేకపోయింది.

ట్రాఫిక్ మొత్తం దిగ్భ్రాంతిగా చూస్తుండగానే ఆ నలుగురూ విశ్వాని బయటికి లాగారు.

ముందొక మెరుపు. మరుక్షణం కత్తి విశ్వ పొట్టలో దిగింది.

కెవ్వుమన్న ఆర్తనాదానికి ముందే రక్తం ఫౌంటెన్‌లా బయటికి చిమ్మింది.

ఆ క్షణంలో విశ్వ చేసిన పొరపాటు వెళ్ళబోతున్న నలుగుర్నీ ప్రతిఘటించాలని ప్రయత్నించటం.

అంతే. . .

మరోసారి గాలిలోకి లేచిన కత్తి యీ సారి కూడ పొట్టని చీరింది నిర్దాక్షిణ్యంగా.

అ. . . మ్మా. . .

సన్నని మూలుగు వెలువడింది విశ్వా నోటి నుంచి.

మరుక్షణం నిస్త్రాణగా రక్తపు మడుగులోకి జారిపోయాడు.

అప్పుడు సమయం అయిదు గంటల ఏభయిరెండు నిముషాలు.

ఆరు గంటలు కావటానికి మిగిలింది మరో నిముషం.

అప్పటికే క్విజ్ మాస్టర్ సత్యేంద్రబసుతో పాటు రాజేంద్ర కూడా వేదికపై కూర్చుని వున్నారు.

క్విజ్ కాంపిటీషన్ స్పాన్సర్ చేసే కృషి ఫార్మాస్యూటికల్స్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ మైకు ముందు నిలబడి ఆదేశం కోసం అన్నట్టుగా ముందు వరుసలో కూర్చున్న కృషి వేపు చూశాడు.

ఆమెలో సంచలనం లేదు.

భావరహితంగా. . .

ఆలోచిస్తూంది.

విశ్వా గెలిస్తే తను ఓడిపోతుంది. . . విశ్వా ఓడినా తను చౌదరితో గెలుపు సాధించలేక అదో ఓటమే అవుతుంది. . .

ఆరు గంటలకి మిగిలింది మరో ముప్పై సెకండ్లు. . .

విశ్వ రాలేదు. . .

ఇక రాజేంద్ర గెలిచినట్టుగా అనౌన్స్ చేయడమే మిగిలిన కార్యక్రమం. . .

పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌ని చూస్తూ సంజ్ఞ చేసింది కృషి.

"డియర్ ఫ్రెండ్స్" చెప్పడం ప్రారంభించాడు పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసరు "పోటీ రెగ్యులేషన్స్ ప్రకారం ఇద్దరు పార్టిసిపెంట్స్ క్విజ్ మాస్టరు ముందు నిర్ణీత సమయానికి హాజరుకావాలి. కాని ఒక్క రాజేంద్ర మాత్రమే అటెండ్ కావడంతో. . ."

అతడు చెప్పబోతున్నది యింకా పూర్తికానేలేదు, విద్యార్థులు విజయోత్సాహంతో రాజేంద్రకి అనుకూలంగా చప్పట్లు కొట్టడం ప్రారంభించారు.

అదిగో సరిగ్గా అప్పుడు వినిపించింది. . .

"ప్లీజ్. . . వెయిట్"

ఆ గావు కేకతో అంతా ద్వారం వేపు చూశారు. . .

శరీరానికి ఓ షాల్‌లాంటిది చుట్టుకుని నిలబడి వున్నాడు విశ్వ. . .

కళ్ళలో ఎరుపు జీరలతో తూలిపోతున్న శరీరాన్ని బలంగా కూడగట్టుకుంటూ ఒక్కో అడుగూ వేస్తున్న విశ్వ పోటీకి వచ్చినట్టు లేదు. . . వధ్య శిలవేపు నడుస్తున్న బలిపశువులా కనిపిస్తున్నాడు.

రాజేంద్ర మొహంలో నిశ్చేష్టత. . .

అప్పటికే ఏం జరిగిందీ తెలుసుకున్న రాజేంద్ర విశ్వ యిక రాడూ అనుకున్నాడు. బ్రతికే అవకాశంలేని విశ్వ ఒకవేళ బ్రతకాలనుకున్నా వెళ్ళాల్సింది హాస్పిటల్‌కి కాని యిక్కడకు కాదు.

కేవలం అతనే స్థితిలో వున్నదీ ఒక్క రాజేంద్రకి మాత్రమే తెలుసు. . . అందుకే ముందు వరుసలోని లాయరు రంగధాం కేసి చూశాడు.

రంగధాం కంగారు పడలేదు. . . ఏ క్షణంలో అయినా స్పృహ తప్పే విశ్వనే గమనిస్తున్నాడు మృదువుగా నవ్వుతూ. . .

కళ్ళు మసకలుబారుతుంటే డయాస్ పైకి వచ్చి తన సీటులో కూర్చున్నాడు విశ్వ...

"నౌ ఇటీజ్ ఎగ్జాక్ట్లీ సిక్స్. . . డయాస్‌ని క్విజ్ మాస్టర్‌కి హేండోవర్ చేస్తున్నాను." అంటూ సత్యేంద్రబసుకి మైక్‌ని అప్పచెప్పి పక్కకి జరిగాడు పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్. . .

సూటిగా అసలు విషయానికి వస్తూ సత్యేంద్రబసు అన్నాడు. "ఐ వెల్‌కమ్ మై అదర్

.ఇప్పుడు పోటీ నిబంధనలకి సంబంధించి కాంపిటీషన్ గడువు అరవై నిముషాలు. . . మొదటి ఏభై నిముషాలు సుమారు ముప్పై ప్రశ్నలు అడగడం జరుగుతుంది. . . అంటే చెరో పదిహేను ప్రశ్నలు . . . ఆలోచించుకోటానికి యివ్వబడే వ్యవధి ముప్పై సెకండ్లు. . . ఒక్కో జవాబుకీ పది మార్కులు. . . ఏ వ్యక్తయినా జవాబు చెప్పలేకపోతే అదే ప్రశ్న రెండో పార్టిసిపెంట్‌ని అడుగుతాను. . . అతడూ చెప్పలేనప్పుడు ఆ మార్కులు క్విజ్ మాస్టర్‌కి చెందుతాయి." క్షణం ఆగి సాలోచనగా ఆడిటోరియం వేపు చూశాడు. "చివరిగా మిగిలిన పది నిముషాల్ని చెరో అయిదు నిముషాలుగా విభజించి ఒక్కో వ్యక్తినీ వరుసగా పది ప్రశ్నలు అడగడం జరుగుతుంది. ఒక్కో జవాబుకీ కేటాయించబడిన మార్కులు అయిదు. . . సో మిస్ రీటా. . ." డయాస్ పై ఓ మూల కూర్చున్న తన అసిస్టెంట్ రీటా కేసి చూశాడు సత్యేంద్రబసు. . .

రీటా స్కోరు రికార్డ్ చేయడానికి ఉద్యుక్తురాలౌతూ స్టాప్ వాచ్ బటన్ ప్రేస్ చేసింది.

"మిస్టర్ రాజేంద్ర. . . మెదడుని శరీరంలో రక్తాన్ని చల్లబరిచే పదార్థంగా పొరపాటు పడిన వేదాంతి ఎవరు?"

"అరిస్టాటిల్"

"రైట్. . నౌ ఇట్స్ యువర్ టర్న్ మిస్టర్ విశ్వనాథ్. సైంటిఫిక్ అయిడియాల్ని ప్రయోగాత్మకంగా నిర్ధారిస్తే తప్ప నమ్మకూడదని ప్రపంచానికి తెలియ చెప్పిన తొలి శాస్త్రజ్ఞుడెవరు?"

"ఫ్రాన్సిస్ బేకన్"

"రైట్. . . నౌ మిస్టర్ రాజేంద్ర. . .దూరాన్ని నిర్ధారించే 'మైలు' అనే పదానికి మూలం ఏమిటి?"

"లాటిన్ భాషలోని మిల్లెపాస్సుయ్. అంటే థౌజండ్ పేసెస్"

"వెరీ కరెక్టు. . ." విశ్వని చూస్తూ అడిగాడు సత్యేంద్రబసు.

"మిస్టర్ విశ్వనాథ్. . .సముద్రంలో అతి లోతైన ప్రాంతం ఏ సముద్రంలో ఎక్కడ వుంది?"

"పసిఫిక్ మహా సముద్రంలోని యారియానాస్ ట్రెంచ్. . . అక్కడ లోతు ముప్పై ఆరువేల నూట అరవై అడుగులు."

"రైట్. . . నౌ మిస్టర్ రాజేంద్ర. . . అన్ని సముద్రాలనీ ఉప్పుగా మార్చితే ఎంత పరిమాణం గలదవుతుంది."

"అన్ని ఖండాలనీ నూట ఏభై మీటర్ల దళసరి ఉప్పుతో సమాధిచేయవచ్చంటూంది సైన్స్..."

"వెరీ కరెక్టు"

విద్యార్థులు కరతాళ ధ్వనులతో హోరుతో ఆడిటోరియం ప్రతిధ్వనించిపోయింది...

"నౌ మిస్టర్ విశ్వనాథ్. . . సుమారు ఇరవై నాలుగు సంవత్సరాల పాటు సముద్రంలోని

డాల్ఫిన్ ఏ ప్రాంతంలో వుండేదో చెప్పగలరా?"

"1888 నుంచి 1912 దాకా సుమారు పది కిలో మీటర్ల దూరం ఓడలని ఎస్కార్ట్ చేస్తూ సముద్రంలో నుంచి సన్నని చానల్ ద్వారా పోర్టుకి తీసుకువచ్చే యీ డాల్ఫిన్ న్యూజిలాండ్ ప్రాంతంలోనిది."

"వండర్‌ఫుల్. . .మిస్టర్ రాజేంద్ర 1970 లో ఓ పత్రికా సంపాదకుడు ఓ రచయితకి ఆవు శరీరంపై చెక్ రాస్తే దాన్ని ఆనర్ చేసింది ఓ బేంక్. . . ఇది జరిగింది ఏ దేశంలో. . .ఆ రచయిత ఎవరు?"

రాజేంద్రలో చలనం లేదు.

కణతలు నొక్కుకుంటూ ఆలోచించాడు. . .

బజర్ మోగింది ముప్పై సెకండ్లు పూర్తయినట్టుగా.

"మిస్టర్ విశ్వనాథ్. ఇట్స్ యువర్ టర్న్ నౌ. . ."

"బ్రిటిష్ హ్యూమర్ మేగజిన్ 'పంచ్'కి చెందిన ఎడిటర్ రాసిన ఆ చెక్కు రచయిత ఏ పి హెర్బర్ట్‌కి చెందినది."

ఆడిటోరియంలో రెస్పాన్స్ లేకపోయినా అభినందనగా విశ్వని చూశాడు సత్యేంద్రబసు "ఇట్స్ మార్వలస్ మిస్టర్ విశ్వనాథ్. . నౌ ది క్వశ్చన్ గోస్ టు రాజేంద్ర అగైన్. . . మిస్టర్ రాజేంద్ర మలేరియా అనే పదం ఏ భాష నుంచి వచ్చింది."

"ఇటాలియన్. MALARIA మనం తరచూ వాడే పదం మలేరియాకి మూలం. . . అంటే చెడుగాలి అని అర్థం. . ."

"నైస్. నౌ మిస్టర్ విశ్వనాథ్. ప్రముఖ హాలీవుడ్ నటుడు డస్టిన్ హాఫ్‌మేన్ నటుడిగా ఆస్కార్ అవార్డు సాధించిన చిత్రం పేరు రైన్‌మేన్. అందులో అతడు పేషెంట్‌గా నటించాడు. . . ఆ జబ్బు పేరేమిటి"

నిశ్శబ్దం. . .

జవాబు తెలీక కాదు. . . జవసత్వాలుడిగి పోయినట్టు శరీరం పట్టు తప్పుతోంది. . . బడలికగా కుర్చీ హేండిల్‌పై వాలిపోతుంటే ఉద్విగ్నంగా అతడ్ని సమీపించాడు సత్యేంద్రబసు "మిస్టర్ విశ్వనాథ్. . ."

కనురెప్పల్ని బరువుగా పైకి లేపుతూ అన్నాడు విశ్వ "SAVANT SYNDROME"

"యు ఆర్ రైట్. . . ఆర్యూ ఓకే" నెమ్మదిగా అడిగాడు అనుమానంగా చూస్తూ.

"ప్లీజ్ గో ఎహెడ్" శక్తిని కూడగట్టుకుంటూ అన్న విశ్వని చూసి అంతసేపూ పట్టించుకోని కృషి అనుమానంగా డయాస్‌వేపు నడిచింది.

ఒకవేళ కృషి మరింత లోతుగా జరిగిందేమిటో తెలుసుకోవాలన్న ఆసక్తి వుంటే శాల్‌కి

“మిస్టర్ రాజేంద్ర. సవంత్ సింద్రోమ్ లక్షణాలు చెప్పండి.”

ఏ క్షణంలో అయినా నేల కూలేట్టున్న విశ్వని గమనిస్తూ ఉత్సాహంగా చెప్పుకుపోయాడు రాజేంద్ర. “సవంత్ అంటే తెలివైనవాడూ అని అర్థం. అరుదైన ఈ జబ్బులోని ప్రత్యేకత యీ జబ్బుగల మనిషి నలభై వేల సంవత్సరాల క్రితం ఓ తేదీని బట్టి క్షణాల్లో అది ఆదివారమో సోమవారమో చెప్పగలడు. కాని రెండూ ప్లస్ రెండూ ఎంతో చెప్పలేడు”

“యూ ఆర్రై ౯ట్ నౌ మిస్టర్ విశ్వనాథ్. క్రీస్తుశకం 1773 నుంచి 1873 దాకా అమెరికాలోని డాక్టర్లు రక్తానికి బదులు రోగులకి ఎక్కించిన ద్రవం ఏది?”

“పాలు”

“ఫైన్. నౌ మిస్టర్ రాజేంద్ర. . . ముఖ్యంగా మంచినీళ్ళ చెరువుల్నుంచి పట్టిన పచ్చి చేపల్ని లేక సరిగా వుడకబెట్టని చేపల్ని తింటే జరిగే అనర్థం ఏమిటి”

“జీర్ణం కాదు” టక్కున అన్నాడు రాజేంద్ర.

“సైంటిఫిక్‌గా జవాబు కావాలి”

తెల్లమోహం వేసుకు చూస్తూ ఉండిపోయాడు రాజేంద్ర.

“అలాంటి చేపల్ని తిన్న వ్యక్తి కడుపులో టేప్‌నార్మ్స్ చేపల ద్వారా ప్రవేశించి సుమారు పదమూడు సంవత్సరాలపాటు స్థావరం ఏర్పరచుకొని పది అడుగుల పొడవుదాకా పెరుగుతాయి. ఆ వ్యక్తిని రక్తలేమికి గురిచేస్తాయి” చెప్పాడు విశ్వ మగతగా.

“ఇంకా ముప్పై సెకండ్లు పూర్తికాలేదు” జోక్యం చేసుకున్నాడు రాజేంద్ర.” కాబట్టి చెప్పింది చెల్లదు.”

రాజేంద్రకి వత్తాసుగా అతడి బలగానికి చెందిన విద్యార్థులంతా ఆడిటోరియంలో కేకలు పెట్టడం ప్రారంభించారు. “యస్. . . ఇది చెల్లదు.”

ఏ స్థితిలో విశ్వా ఈ నియమాన్ని ఉల్లంఘించిందీ తెలీని సత్యేంద్ర క్షణం అతడ్ని చూసి అన్నాడు. “యస్. ఇప్పటి పది మార్కులు క్విజ్ మాస్టర్‌కి చెందుతాయి.”

“ఓకే” అన్నాడు విశ్వ నిస్త్రాణంగా చేతిని పైకెత్తి.

“సో. మిమ్మల్నే మరో ప్రశ్న అడుగుతున్నాను. మనిషిలో మరుపుకి కారణమైన ఆల్జిమీర్స్ డిసీజ్‌ని మొదట గుర్తించిన వ్యక్తి ఎవరు?”

“అలోయిస్ ఆల్జిమీర్ అనే జర్మన్ నెర్వ్ ఎక్స్‌పర్ట్ 1907లో ఇది గుర్తించారు.”

“రైట్. నౌ మిస్టర్ రాజేంద్ర. ప్రపంచంలో అత్యధిక సర్క్యులేషన్‌గల దిన పత్రిక ఏది.”

“అమెరికాకి చెందిన న్యూయార్క్ టైమ్స్.”

“రాంగ్” టక్కున ఖండించిన సత్యేంద్ర ఈ సారి ముప్పై సెకండ్లు పూర్తయ్యేదాకా ఆగి బజర్ మోగగానే విశ్వనాథ్‌ని చూస్తూ అన్నాడు “నౌ. ఇట్స్ యువర్ టర్న్ మిస్టర్ విశ్వనాథ్.”

“జపాన్‌కి చెందిన దినపత్రిక యమియూరీ షింబున్. 1874లో ప్రారంభమైన ఈ పత్రిక

సర్క్యులేషన్ పధ్నాలుగున్నర మిలియన్లు. అంటే ముప్పై ఎనిమిది శాతం ప్రజలు దీన్ని రోజూ చదువుతుంటారు."

"రైట్" రాజేంద్ర మొహంలో పెరుగుతున్న టెన్షన్ని చూస్తూ అడిగాడు సత్యేంద్ర. "మిస్టర్ రాజేంద్ర గజెట్ అనే పదానికి మూలం ఏది?"

"GAZETTE అనే పదానికి మూలం ఇటాలియన్ GAZETTA"

"మిస్టర్ విశ్వనాథ్. 'గజెట్టా' అనే పదానికి ఓ మూలం వుంది అదేమిటి?"

"1563లో ఇటలీకి చెందిన వెనిస్ నగరంలో ప్రజలు బహిరంగంగా చదివే వార్తలకి ఓ కాపర్ నాణేన్ని చెల్లించేవారు. ఆ నాణెం పేరు గజెట్టా"